

జడ్పీ స్థలంలో వైసీపీ నేత ఏర్పాటు చేసిన హోటల్



వైసీపీ నేతకు వత్తాసు

- జడ్పీ స్థలంలో హోటల్ ఏర్పాటుకు సహకారం
- టీడీపీ అధికారంలోకి వచ్చినా వీడని మమకారం
- నామమాత్రపు నోటీసులతో సరి
- ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలనూ పట్టించుకోని వైనం

కడప రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోను వైసీపీ నేతకు కొందరు జడ్పీ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సదరు నేతతో అంటకాగి కడప నగర నడిబొడ్డున రూ.2 కోట్ల జడ్పీ స్థలంలో హోటల్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందించారు. పదినెలల క్రితం కూటమి అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ ఆ హోటల్ తొలగింపునకు గట్టి చర్యలు తీసుకోలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే ఆ హోటల్ వ్యవహారం తెరపైకి వచ్చింది. దీంతో వైసీపీ నేతతో అంటకాగిన అధికారులు పథకం ప్రకారం ఆయనకు నోటీసులు ఇచ్చి వాటి ద్వారా కోర్టుకు వెళ్లేలా పురమాయించారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. తరువాత స్టేను వెకేట్ చేయించేందుకు ఎలాంటి ప్రయత్నాలూ చేయలేదు. దీంతో వైసీపీ నేత హోటల్‌ను ఆనుకుని ఉన్న జడ్పీ స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్లు వేశారు.

ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్‌సీ సమావేశంలో ఈ హోటల్ విషయం చర్చకు రాగా దీనిపై తీవ్ర దుమారం లేచింది. వెంటనే హోటల్‌ను తొలగించాలంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత జడ్పీ అధికారులను ఆదేశించారు. కానీ జడ్పీ అధికారులు మంత్రి ఆదేశాలను లైట్‌గా తీసుకున్నారు. ఈ విషయం తెలిసి జడ్పీ అధికారులపై ప్రభుత్వం సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ వైసీపీ నేతకు నోటీసు జారీచేశారు. ఈ నోటీసులకు వైసీపీ నేత తమ లాయర్ ద్వారా ప్రతి నోటీసు పంపారు. దీంతో జడ్పీ అధికారులు నిమ్మకుండిపోయారు. ఈ వ్యవహారంపై తాజాగా పైనుంచి ఒత్తిడి రావడంతో మరోమారు జడ్పీ సీఈవో జడ్పీ ఆస్తులను అభివృద్ధి చేసుకోదలిచామని ఇందుకు సహకరించాలని వినమ్రమైన సమాచారంతో వైసీపీ నేతకు పోస్టు ద్వారా నోటీస్ పంపారు. ఈ నోటీసులను ఆయన తీసుకోలేదని సమాచారం. దీంతో జడ్పీ సిబ్బంది ద్వారా గోడకు నోటీసు అతికించారు. తదుపరి వైసీపీ నేత హోటల్ పక్కన ఏర్పాటుచేసిన షెడ్డుపైన రేకులను మాత్రమే తొలగించారు. రూ.2 కోట్ల జడ్పీ స్థలంలో ఏర్పాటు చేసిన హోటల్‌ను మాత్రం కొనసాగిస్తున్నారు. దీనిపై జడ్పీ సీఈవో ఓబులమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని స్థలాన్ని అభివృద్ధి చేసుకోవడానికి సహకరించాలని హోటల్ నిర్వాహకునికి నోటీసులు పంపించామన్నారు. రెండుసార్లు నోటీసులు పోస్టు ద్వారా పంపగా తిరస్కరించడంతో గోడకు అంటించామన్నారు. జడ్పీ స్థలం లో ఉన్న హోటల్‌పై స్టే తెచ్చుకున్నారని, స్టే వెకెట్‌కు ప్రయత్నిస్తున్నామన్నారు.

రాత్రివేళ నిఘా పెంచాలి : ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో దొంగతనాలు పెరిగిపోయాయని చోరీలను అరికట్టేందుకు రాత్రివేళ ప్రతి పోలీసు స్టేషను పరిధిలో నిఘా పెంచాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పోలీసులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి నెలలో వారం వ్యవధిలో లక్ష్మీనగర్, హౌసింగ్ బోర్డుకాలనీలలో రెండు భారీ దొంగతనాలు జరిగాయన్నారు. బుధవారం అర్ధరాత్రి బొల్లవరం వెంకటేశ్వర స్వామి దేవళం వద్ద నాలుగు ఇళ్లలో చోరీలు జరిగాయన్నారు. అందులో యనమల చంద్రశేఖర్ రెడ్డి ఇంట్లో భారీగా బంగారు, నగదు, చీరలు, బట్టలు సైతం దొంగలు లూటీ చేశారన్నారు. ఈ వరుస దొంగతనాలతో ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. దీనిని పోలీసులు సవాలుగా తీసుకుని దొంగలను పట్టుకోవడంతో పాటు ప్రజల సొత్తును త్వరగా రికవరీ చేయాలన్నారు. పట్టణ జనాభాకు తగ్గట్లు ఇక్కడ పోలీసులు లేనిమాట వాస్తవమేనని, ఉన్న పోలీసులు డ్యూటీలో నిజాయితీగా పనిచేస్తే నేరాలను అరికట్టవచ్చన్నారు. ఈ దొంగతనాలపై ఎస్పీతో మాట్లాడానన్నారు. ప్రజలు ఆందోళ చెందకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే వారు కెమెరాలు పెట్టి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో టీడీపీ మాజీ కౌన్సిలర్లు వద్దిబాలుడు, జంబాపురం రామాంజనేయరెడ్డి, తలారి పుల్లయ్య, టీఎన్‌టీయూసీ నాయకుడు కుతుబుద్దీన్ పాల్గొన్నారు.



ఎండాకాలం వచ్చింది. సూర్యుడు మండిపోతున్నాడు. దీంతో చెరువులు, వాగులు, వంకల్లో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. పశువులకు తాగునీరు లేక దాహంతో అలమటిస్తున్నాయి. వేసవిలో వాటి దాహార్తిని తీర్చేందుకు తాగునీటి తొట్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని సూచించింది. కానీ వీటిపట్ల అధికారుల నుంచి పెద్దగా స్పందన లేదని నీటితొట్ల నిర్మాణాలను చూస్తే అర్థమవుతుంది. జిల్లాలోని పశువులకు 481 తాగునీటి తొట్లు అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 100 మాత్రమే పూర్తిచేశారు.



మూగవేదన పట్టదా..?

- పశువుల తాగునీటి తొట్లపై నిర్లక్ష్యం
- 481 అవసరంగా గుర్తింపు
- ఇప్పటికి 100లోపే పూర్తి
- మండుతున్న ఎండలు
- దాహార్తితో మూగజీవాలు
- జిల్లాలో 17.43 లక్షల పశువులు, మేకలు గొర్రెలు

కడప రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని పశువుల దాహార్తిని తీర్చేందుకు రూ.1,58,73,000తో 481 నీటితొట్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. ఇందులో ఒక్కొక్క నీటితొట్టి నిర్మాణానికి రూ.33 వేలు ఖర్చుచేస్తున్నారు. కడప డివిజన్‌లో 279, జమ్మలమడుగు డివిజన్‌లో 106, పులివెందుల డివిజన్‌లో 96 నీటి తొట్ల నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లాలో పాతవి 620 వరకు నీటితొట్లు ఉన్నట్లు అధికారుల గణాంకాలు పేర్కొంటున్నాయి. ఇందులో కడప డివిజన్‌లో 289, జమ్మలమడుగు డివిజన్‌లో 192, పులివెందుల డివిజన్‌లో 139 ఉన్నాయి. వీటిలో చాలా వరకు పాడై పోయాయి. వీటికి మరమ్మతులు చేయడంలోనూ అధికారులు శ్రద్ధ చూపడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

1500 లీటర్ల సామర్థ్యంతో నిర్మాణం

ఒక్కో నీటితొట్టి 1500 లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. 0.6 మీటర్ల లోతు, 2 మీటర్ల వెడల్పు, 5 మీటర్ల పొడవుతో జిల్లాలో మొత్తం 481 ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 3,99,000 గేదెలు, 44 వేల ఆవులు ఎద్దులు, 13 లక్షల మేకలు గొర్రెలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రతి రోజు ఒక ఆవుకు 30 లీటర్లు, గేదెకు 40 లీటర్ల నీరు అవసరం. ఒక మేకకు, ఒక గొర్రెకు రోజుకు 5 లీటర్ల నీరు అవసరం. ఇందుకోసం ఆయా గ్రామాలలో నీటితొట్లను నిర్మించాలని ప్రభుత్వం సూచించింది.

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం

వేసవిలో పశువుల దాహార్తిని తీర్చే నీటితొట్ల నిర్మాణంలో ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం కనబడుతోంది. గ్రామాలలో పశువులకు అవసరమైన నీటితొట్ల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించడంతో పాటు వాటిని సకాలంలో పూర్తిచేయించి వినియోగంలోకి తెచ్చే బాధ్యత పశుసంవర్ధకశాఖ చేపడుతోంది. ఇందుకు అవసరమయ్యే నిధులను డ్వామాశాఖ ఉపాధి పథకం ద్వారా ఖర్చుచేస్తున్నారు. పూర్తి అయిన నీటితొట్లకు నీరు నింపే బాధ్యత గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యుఎస్)కు కేటాయించారు. అయితే ఈ శాఖల అధికారుల సమన్వయలోపం పశువులకు శాపంగా మారింది. నీటితొట్ల నిర్మాణాలు ఇంకా పూర్తికాకపోవడం, పూర్తి అయినచోట నీరు నింపకపోవడంతో పశువులు దాహంతో అల్లాడుతున్నాయి.



పెండ్లిమర్రి మండలంలో పశువుల తాగునీటి తొట్టె నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ


కూలీలకు ఉపాధి

రబీ సీజన్‌లో పంటల సాగు దాదాపు పూర్తయింది. వరి ఇతర పంటల కోతలు ముగిశాయి. కూలీలకు పనులు లేవు. ఈ నేపథ్యంలో గ్రామాలలో పశువుల నీటితొట్ల నిర్మాణాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతుండడంతో కూలీలకు ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా పశువుల నీటి తొట్ల నిర్మాణాలపై అధికారులు పూర్తిగా దృష్టిసారిస్తే అటు మూగజీవాలకు దాహార్తి తీరడంతో పాటు.. ఇటు కూలీలకు ఉపాధి దొరుకుతుంది.

మరింత వేగంగా నీటితొట్ల నిర్మాణాలు

జిల్లాలో పశువుల తాగునీటి తొట్ల నిర్మాణాలను మరింత వేగవంతంగా పూర్తి చేస్తాం. జిల్లాలో 481 నీటితొట్లు అవసరమని గుర్తించగా ఇప్పటివరకు 100 పూర్తి చేశాం. మిగిలినవి త్వరలో పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఒక్కొక్క నీటి తొట్టిని రూ.33 వేలతో 1500 లీటర్ల సామర్థ్యంతో ఉపాధి నిధుల ద్వారా నిర్మిస్తున్నాం.

- శారదమ్మ, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి



పెండ్లిమర్రి మండలంలో పూర్తయిన పశువుల తాగునీటి తొట్టికి నీరు నింపుతున్న దృశ్యం

సోనూ ఆత్మహత్య ఘటనపై డీఎస్పీ విచారణ

కడప క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కడప టూటౌన్ పోలీస్ స్టేషనులో గంజాయి కేసుకు సంబంధించిన నిందితుడు షేక్ సోనూ ఆత్మహత్యకు పాల్పడడంపై విచారణాధికారి, జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్న కిటికీ, గ్రిల్‌ను, అనంతరం స్టేషన్‌లో రికార్డు అయిన సీసీ పుటేజీలను పరిశీలించారు. రాత్రి విధులు నిర్వహించిన కానిస్టేబుల్ మహ్మద్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ నరసింహులును వేర్వేరుగా విచారించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 211/24 క్రైంకు సంబంధించి గంజాయి కేసులో బుధవారం రాత్రి 10గంటలకు షేక్ సోనూ ఆలియాస్ పాండను అరెస్టు చేశారన్నారు. గురువారం ఉదయం జడ్జి ఎదుట హాజరు పరచాల్సి ఉండగా తెల్లవారుజామున 3గంటల సమయంలో అతను బాత్‌రూములో గ్రిల్‌కు చొక్కాతో ఉరి వేసుకున్నాడన్నారు. అయితే ఆత్మహత్యకు పాల్పడిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు నిమిషాల్లో స్పందించారన్నారు. అతన్ని కిందకు దించి సీపీఆర్ కూడా చేశారని, అప్పటికీ అతనిలో చలనం లేకపోవడంతో రక్షక్ వాహనంలో రిమ్స్‌కు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. గతంలో సోనూ చేతులు కోసుకున్న గాయాలు సైతం గుర్తించామన్నారు. దీనిపై కూడా మరింత లోతుగా దర్యాప్తు చేసి నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామన్నారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉందని.. ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కడప టూటౌన్ పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

నేడు ఈ-వేస్ట్ సేకరణ

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఇ-చెక్ అనే థీమ్‌తో స్వచ్ఛ దినోత్సవాన్ని నిర్వహించి ఈ-వేస్ట్ సేకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. శనివారం చేపట్టాల్సిన అంశాలపై శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు డీఆర్వో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఏ యే ప్రదేశాల్లో కార్యక్రమాలు జరుగుతాయో ప్రజలకు తెలిపి వారందరినీ భాగస్వాములు చేయాలన్నారు. ప్రజల నుంచి ఈ-వేస్ట్ సేకరణ జరుగుతుందని తెలియజేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ-వేస్ట్ సేకరణకు బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ-వేస్ట్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులందరూ తమ కార్యాలయాల్లో ఉన్న ఈ-వేస్ట్‌ను తీసుకుని సిబ్బందితో శనివారం ఉదయం 7-30 గంటలకు ఏడురోడ్ల కూడలి వద్దకు విధిగా రావాలన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించేందుకు అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించాలని డీఆర్వో తెలిపారు.

భానుడి భగభగలు

- 19 మండలాల్లో 40-41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



కడప కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం జిల్లాలో భానుడి భగభగలు, వేడిగాలులు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జిలాల్లో 36 మండలాలు ఉండగా అందులో 19 మండలాల్లో 40-41.6 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా బద్వేలులో 41.6 డిగ్రీలు, కడప, సిద్దవటం, అట్లూరులో మండలాల్లో 41.5 డిగ్రీలు నమోదయ్యాయి. ఒంటిమిట్ట, వేంపల్లి మండలాల్లో 41.2 డిగ్రీలు, యర్రగుంట్ల, కమలాపురంలలో 41 డిగ్రీలు, తొండూరు 40.7, సింహాద్రిపురం 40.9, ప్రొద్దుటూరు 40.1, వేములలో 40.7, వల్లూరు, పెండ్లిమర్రి మండలాల్లో 40.6 డిగ్రీలు నమోదయ్యాయి. అలాగే పెద్దముడియం 40, ఖాజీపేట 40.4 చింతకొమ్మ దిన్నె 40.5, చెన్నూరు 40, చాపాడులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 38-39.8 డిగ్రీల వరకు ఎండలున్నాయి. కాగా శని, ఆదివారాల్లో సైతం ఇదే స్థాయిలో ఎండలు ఉంటాయని ఏపీ విపత్తుల శాఖ శుక్రవారం ప్రకటించింది.

పోలీస్‌స్టేషన్‌లో రచ్చ రచ్చ

పెండ్లిమర్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది సాక్షిగా ఎస్సై మధుసూదన్ రెడ్డికి, నాగాయపల్లె గ్రామానికి చెందిన రామఓబుల్ రెడ్డి అలియాస్ ఇంద్రసేనారెడ్డికి మధ్య గురువారం రాత్రి రచ్చ జరిగింది. ఈ రచ్చలో ఇంద్రసేనారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ రచ్చకు కారణంపై విభిన్న కథనాలు విని పిస్తున్నాయి. సెల్‌ఫోన్ విషయం అని కొందరు, మండలంలో జ రుగుతున్న గ్యాంబ్లింగ్ విషయమని మరికొందరు చర్చించుకుం టున్నారు. ఇక గాయపడిన ఇంద్రసేనారెడ్డి రిమ్స్ ఆసుపత్రిలోని ఔట్ పోస్టులో ఫిర్యాదుచేసి ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఉన్నతాధికారుల విచారణలో నిజానిజాలు తెలియాల్సి ఉంది. కాగా.. తనను చితకబాదిన పోలీసులపై మానవహక్కుల సంఘాన్ని బాధితుడు ఆశ్రయించనున్నట్టు సమాచారం.



పోలీసుల లాఠీ దెబ్బలతో ఇంద్రసేనారెడ్డి శరీరంపై తేలిన వాతలు

గుడ్ ఫ్రైడే వేడుకల్లో విశ్వాసులు



భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కడప నగరంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం విచారణ డైరెక్టర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ పిల్లి మహేశ్ ఆధ్వర్యంలో పురవీధుల్లో సాగిన శిలువ యాత్ర విశ్వాసులను ఎంతగానో ఆకట్టుకుంది. మరియాపురం పాత చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప మేత్రాసన పీఠాధిపతి (బిషప్) సగినాల పాల్ ప్రకాశ్ విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడారు. తదనంతరం ఆయన శిలువను భుజంపై మోశారు.

- (కడప కల్చరల్-ఆంధ్రజ్యోతి)



శిలువను భుజంపై మోస్తున్న బిషప్ సగినాల పాల్ ప్రకాశ్





కమలాపురంలో..

ముత్యాల తలంబ్రాలు తిరుపతికి తరలింపు

- మండల అధికారులకూ అందని వైనం.. భక్తుల అసంతృప్తి

7



చేతికొచ్చిన పంట చేజారింది



- 200 క్వింటాళ్ల పసుపు నీటమునక
- వడగండ్ల వానతో రైతు కన్నీరు

7

నీటి సమస్యకు ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు

- జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి



వేంపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి సమస్యకు ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు ఖర్చు చేస్తున్నామని జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి తెలిపారు. వేంపల్లెలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీశ్‌రెడ్డితో శుక్రవారం జడ్పీ చైర్మన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జడ్పీ చైర్మన్లకు ప్రభుత్వం గన్‌మెన్‌లను తొలగించడం అన్యాయమన్నారు. అమ్మకు వందనం, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాల గురించి జడ్పీటీసీ సభ్యులు అడుగుతారని కూటమి ఎమ్మెల్యేలు జడ్పీ సమావేశానికి రావడం లేదన్నారు. జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు రూ.16కోట్ల దాకా అందుబాటులో ఉండగా, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఖర్చు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే జడ్పీ ద్వారా జరిగిన పనులకు సంబంధించి రూ.6కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు మే8న జడ్పీ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవరు మృతి


మృతిచెందిన పాలెం రాజు

చెన్నూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవే రహదారిలో రెండు రోజుల కిందట ఆటోను వెనుక వైపు నుంచి వచ్చి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఆటో డ్రైవరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఈయన కూడా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 16న నలుగురు ప్రయాణికులతో ఆటో చెన్నూరు నుంచి కడప నగరానికి వెళుతోంది. కాగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి వచ్చి ఆటోను ఢీకొనగా అందులో ప్రయాణిస్తున్న స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన లక్ష్మిగాండ్ల బాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో మిగిలిన వారికి స్వల్ప గాయలవడంతో పాటు ఆటో డ్రైవరు పాలెం రాజు(26) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వారందరినీ రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం కడప రిమ్స్‌లో డ్రైవర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆటో డ్రైవరు మృతి చెందడంతో స్థానిక కొత్త గాంధీనగర్‌లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు అదుపుతప్పి ఒకరు...


వెంకటసాయి మృతదేహం

సింహాద్రిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిడివెలగల గ్రామం వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వెంకటసాయి(28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... గురువారం రాత్రి 11గంటల సమయంలో సింహాద్రిపురం నుంచి పులివెందుల వైపు బయలుదేరిన ఏపీ16సికె 0005 నెంబరు గల వాహనం నిడివెలగల గ్రామం వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ వాహనంలో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. వీరందరూ పులివెందు లకు చెందినవారే. ఈ సంఘటనలో వెంకటసాయి మృతితో పాటు మరో ముగ్గురు మణిదీప్, శివచంద్ర, వేణు అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పులివెందుల సీఐ ఎస్వీ రమణ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని టీడీపీ కార్యకర్త...



మృతిచెందిన ఇరగంరెడ్డి

రామాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రమైన రామాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు స్కూటర్‌ను ఢీకొని టీడీపీ కార్యకర్త పప్పిరెడ్డి ఇరగంరెడ్డి (50) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి రామాపురంకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపానికి రాగానే కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీకొంది. ఇరగంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని శవపరీక్షకై లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు, మోపెడ్‌ను ఢీకొన్న కంటైనర్

● ఇరువురికి గాయాలు


పెంజి అనంతపురం వద్ద కంటైనర్ మీద పడటంతో నుజ్జయిన కారు

కొండాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజి అనంతపురం గ్రామం వద్ద శుక్రవారం కారు, మోపెడ్‌ను కంటైనర్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... కడప వైపు నుంచి వెళుతున్న గుజరాత్‌కు చెందిన కంటైనర్ వాహనం, కొండాపురం నుంచి అటువైపు వెళుతున్న టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొంది. దీంతో మోపెడ్‌లో వెళ్తున్న పెద్దన్న అనే వ్యక్తి ఎగిరి కింద పడడంతో గాయాలయ్యాయి. అదిచూచి ఇదే వైపు కడప నుంచి తాడిపత్రికి కారులో వెళుతున్న రమణారెడ్డి అనే కారు డ్రైవర్ కంటైనర్‌ను ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో కారును ఓవర్‌టేక్ చేయబోయి కంటైనర్ కారు మీద పడింది. ఈ సంఘటనలో కారు నుజ్జు నుజ్జయి రమణారెడ్డికి గాయాలయ్యాయి. కాగా వారిరువురిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. సంఘటనా స్థలానికి కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శరీరమే మరణం.. నేత్రాలు పదిలం

● కళ్లను ఐ బ్యాంకుకు అందజేసిన మిత్రులు


నేత్రాలను దానం చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శరీరంలో జీవం పోయినా.. ఆయన చూపు మాత్రం పదిలంగా ఉండాలని వారు ఆలోచించారు. వచ్చిందే తడవుగా ఆ నేత్రాలను ఇతరులకు ఉపయోగపడేలా ఓ స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. వివరాల్లోకెళ్తే.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం కంభంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేశారు. పలు మార్లు శత్రు దేశాలతో యుద్ధంలో పాల్గొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎయిర్ ఫోర్స్ నుంచి వచ్చిన తరువాత కూడా వివాహం చేసుకోకుండా జిల్లాలోని పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో పలు విద్యాసంస్థల ఆరంభంలో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అమ్మఒడి (అనాథ పిల్లల సంక్షేమ సంస్థ) ఉమ్మడి కడప జిల్లా సంస్థలో విధులు నిర్వర్తించారు. అలాగే పీలేరులో అనాథ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ ఎందరో పేద, అనాథ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారు. గత 5 ఏళ్లుగా ప్రేమాలయంలో జీవనం కొనసాగిస్తుండేవారు. కాగా అనారోగ్యంతో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లగా రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో తన మిత్రులు లయన్ కొత్త సుదర్శన్, మున్సిపల్ అధికారి మల్లికార్జున, బంధువు లయన్ పీఎస్ హరినాథరెడ్డిల సహాయంతో ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని కడపకు తరలించి ఆయన నేత్రాలు ఎల్వీప్రసాద్ ఐ కేంద్రం వారికి, పార్థివదేహాన్ని కడప రిమ్స్ వైద్య విద్యార్థుల పరీక్షల కోసం అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది డాక్టర్లు సతీశ్, అరవింద్, కడప రిమ్స్ మార్చురీ సిబ్బంది పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట చేజారింది


నేలవాలిన అరటి పంట

● 200 క్వింటాళ్ల పసుపు నీటమునక
● వడగండ్ల వానతో రైతు కన్నీరు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అపార నష్టం రైతాంగాన్ని నట్టేట ముంచింది. చేతికొచ్చిన పంట నీటిలో కొట్టుకుపోయింది. కళ్లముందర పంట కొట్టుకుపోతుండడంతో రైతు కంట కన్నీరు కార్చారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చింతరాజుపల్లె గ్రామంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో సాగుచేసిన అరటి, బొప్పాయి పంటలు నేలకూలాయి. అలాగే ఎండబెట్టిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. అనుకోని వర్షం కురవడంతో రైతు నట్టేట మునిగిపోయారు. ఈ గ్రామానికి చెందిన రాసాల నరసింహులు సుమారు 200 క్వింటాళ్ల పసుపును ఉడకబెట్టి ఎండబెట్టారు. అనుకోని వర్షం కురవడంతో ఎండిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. అలాగే యామన వెంకటసుబ్బయ్య, బొల్లా ఓబులేశు, బొడ్డే శ్రీనివాసులకు చెందిన సుమారు 15 ఎకరాల అరటిపంట నేలపాలైంది. యామన సతీష్, తోట సుబ్బరాయుడు, రాసాల చిన్నయ్యలకు చెందిన సుమారు 13 ఎకరాల బొప్పాయి తోట నేలకొరిగింది. అదేవిధంగా కర్బూజ పంట కూడా దెబ్బతిన్నది. బొల్ల ఆదినారాయణ, సాకే రమణయ్యకు చెందిన ఐదెకరాల కర్బూజ పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఇక వరిపంట కూడా నేలకొరిగింది. భారీ వర్షం కురవడంతో రైతు కుదేలయ్యారు. ఎండిన పసుపు నీటమునగడంతో సుమారు 20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. అరటి, బొప్పాయి తోటలు నేలకొరగడంతో సుమారు రూ.24 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేతికొచ్చిన పంట చేజారింది



పదిరోజుల్లో చేతికొచ్చే పంట పూర్తిగా ధ్వంసమైంది. తాము తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- సతీష్, రైతు, ఒంటిమిట్ట

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎండిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. చేతికొచ్చిన వరిపంట నేలపాలైంది.

- నరసింహులు, రైతు, ఒంటిమిట్ట

అరటి నేలకొరిగింది



ఆరు ఎకరాల అరటి పంట అకాల వర్షంతో నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలపాలైంది. తీవ్రంగా నష్టం వాటిల్లింది.

- శ్రీనివాసులు, రైతు, ఒంటిమిట్ట

అకాల వర్షం... అపార నష్టం

● గాలి, వాన బీభత్సం
● తీవ్రంగా నష్టపోనున్న రైతులు

గాలివీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. గాలి వాన సృష్టించిన బీభత్సానికి చెట్లు నేలకొరగగా మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పెనుగాలులు వీచాయి. పట్టణంలో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గత రెండేళ్లుగా కరువు కాటకాలతో ఈ ప్రాంత రైతులు విలవిల్లాడుతున్నారు. పూలుకుంట, నూలివీడు, గుండ్లచెరువు, గోపనపల్లి, పేరంపల్లి, గాలివీడు తదితర గ్రామ పంచాయతీల్లో పెనుగాలులు వీచాయి. ఈ గాలులతో గోరాన్‌చెరువు పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డికి చెందిన మామిడి తోటలో కాయలన్నీ పూర్తిగా నేలమట్టమయ్యాయి. అంతేగాక కదిరి- రాయచోటి ప్రధాన రహదారి పెట్రోల్ బంక్ వద్ద పెద్ద వృక్ష కొమ్మలు విరిగి రహదారికి అడ్డుగా పడ్డాయి. గాలి వాన బీభత్సంతో మామిడి తోట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి మామిడి తోటలకు ఇన్సూరెన్స్ వర్తించేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.


గాలివీడులో గాలి వానకు నేలరాలిన మామిడి కాయలు

వడగండ్ల వర్షానికి అరటి నేలమట్టం

లింగాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణపాపాయపల్లె, బోనాల, అంకేవానిపల్లె, వెలిదండ్ల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి చెట్లు నేలమట్టమయ్యాయి. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులు మొదలయ్యాయి. కర్ణపాపాయపల్లెలో ఈదురుగాలులు, వడగండ్లు కురవడంతో అరటికి తీవ్రనష్టం వాటిల్లింది. దిగుబడులు చేతికందుతున్న దశలో ఈదురుగాలులు అరటి రైతు వెన్ను విరుస్తున్నాయి. బోనాల, వెలిదండ్ల, అంకేవానిపల్లె గ్రామాల్లో కూడా అరటికి నష్టం వాటిల్లింది. కర్ణపాపాయపల్లెలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ముత్యాల తలంబ్రాలు తిరుపతికి తరలింపు

● మండల అధికారులకు అందని తలంబ్రాలు
● భక్తుల అసంతృప్తి


ముత్యాల తలంబ్రాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవం అనంతరం భక్తులకు పంపిణీ చేయాల్సిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను తిరుపతికి తరలించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. కోదండరామస్వామి కల్యాణోత్సవంలో ఉపయోగించిన ముత్యాల తలంబ్రాలు తమ ఇంటిలో ఉంటే ఆ ఇల్లు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందనేది భక్తుల విశ్వాసం. ఇందుకు విరుద్ధంగా టీటీడీ అధికారులు ప్రవర్తించారు. మిగిలిన ప్యాకెట్లను ఇక్కడి అధికారులకు కానీ, భక్తులకు కానీ ఇవ్వకుండా తిరుపతికి తరలించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వామి వారి కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తుల కొరకు సుమారు 1.70 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఇందుకోసం కల్యాణవేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు కూడా నూతనంగా ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటరు శ్రీవారి సేవకులతో పాటు ఒక టీటీడీ సిబ్బందిని కూడా నియమించారు. ఈ కౌంటర్ల పంపిణీలో కూడా టీటీడీ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని పలువురు విమర్శిస్తున్నారు. కల్యాణం అనంతరం మిగిలిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను టీటీడీ పరిపాలన భవనానికి తరలించారు. ముత్యాల తలంబ్రాలను పుష్పయాగం రోజున భక్తులకు పంపిణీ చేస్తారని పలువురు భక్తులు అనుకున్నారు. కానీ టీటీడీ అధికారులు వాటిని భక్తులకు, మండల అధికారులకు ఇవ్వలేదు. కల్యాణం అనంతరం మండల అధికారులకు, ప్రజాప్రతినిధులకు తదితరులకు ముత్యాల తలంబ్రాలను ప్రతియేడాది పంపిణీ చేసేవారు. అందుకు విరుద్ధంగా ఈ ఏడాది తలంబ్రాలు పంపిణీ చేయకపోవడమేగాక వాటిని ఒక ప్రత్యేక వాహనంలో తిరుపతికి తరలించారు.

మేధావులే సమాజ మార్గదర్శకులు

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ


మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాల దృక్పథం కలిగిన మేధావుల వల్లే సమాజాభివృద్ధి జరుగుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మినారాయణ తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎస్టీ భవన్‌లో శంకరయ్య సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజ హితానికి మేధావుల మార్గనిర్దేశకత్వం ఎంతో అవసరమని అయితే మేధావులు సంకుచిత భావాలు కలిగి ఉండకూడదని, విశాల దృక్పథంతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసే వారిలా ఉండాలన్నారు. మేధావులు ముందుగా మంచి ఆలోచన విధానాన్ని, మార్పులను, వారు ఉంటున్న పరిసర ప్రాంతాల్లోనూ, పనిచేసే సంస్థల్లోనూ వారి కుటుంబ సభ్యుల్లో తీసుకురావాలని సూచించారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైందని, దాన్ని ఆయుధంగా మలుచుకొని తమకు నచ్చిన భావజాలాన్ని ఆలోచన విధానాన్ని బలవంతంగా మనస్సుల్లో జొప్పించి ప్రజలను తమకు నచ్చిన రీతిలో మానసిక బానిసలుగా మార్చుకునే పరిణామాలు జరుగుతున్నాయన్నారు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజల్లో అనేక అంశాలపైన బేధాభిప్రాయాలు ఏర్పడి సమాజంలో అరాచక పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో చదువుకున్న వారు మాత్రమే మేధావులు కారని, సమాజం కోసం మంచి ఆలోచనలు చేసే నిరక్షరాస్యులు కూడా మేధావులేనన్నారు. అనంతరం జేవీవీ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్రా సురేష్‌బాబు, గోపాల్‌దాస్, ఇలియాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వేపూరికోట వంతెనపై బొలెరో...లారీ ఢీ

● వాహనంలో ఇరుక్కుపోయి డ్రైవర్ దుర్మరణం
● ఎక్స్‌కవేటర్ సాయంతో మృతదేహం వెలికితీత
● జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్
● మరొకరికి తీవ్రగాయాలు


బొలెరోలో ఇరుక్కుని మృతి చెందిన నసీబ్

ములకలచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బొలెరో, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెలో డ్రైవర్ ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోవడంతో అతికష్టం మీద మృతదేహాన్ని బయటకు తీశారు. వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు అరటికాయలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం మార్గం మధ్యంలోని ములకల చెరువు మండలం వేపూరికోట సమీపంలోని చిన్నేరు వంతెనపై వచ్చే సరికి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన బొలెరో డ్రైవర్ నసీబ్(46) ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతి కష్టం మీద ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీశారు. దీంతో జాతీయ రహదారికి అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. చివరకు డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసి రోడ్డుపై నుంచి వాహనాలు పక్కకు తీసి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం డ్రైవర్ మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు రెడ్డిప్రసాద్ ఎంపిక


గంపా రెడ్డిప్రసాద్

రామాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంపా నాగేంద్ర కుమారుడు గంపా రెడ్డిప్రసాద్ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపికయ్యారు. ఈ నెలలో హైదరాబాదులో నిర్వహించిన కబడ్డీ సెలెక్షన్‌లో గంపా రెడ్డిప్రసాద్ తనదైన శైలిలో ప్రతిభను కనబర్చడంతో ఈ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపిక చేశారు. గతంలో జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ కబడ్డీ పోటీల్లో 2024లో ఆంధ్రప్రదేశ్ తరపున గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కబడ్డీని హర్యానా రాష్ట్రంలో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో నిర్వహించారు. అందులో తమ మండలానికి చెందిన తన బిడ్డ పాల్గొనడం ఆనందంగా ఉందని గంపా రెడ్డిప్రసాద్ తండ్రి నాగేంద్ర తెలిపారు. అంతేగాకుండా గ్రామ ప్రజలు, మండల ప్రజలు ఈ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ఎంపిక కావాలని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి సమీపం సిద్దవటం రోడ్‌లోని ఓ సందులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన కుటుంబీకులు ఎవరైనా వస్తే పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

గోశాలపై చిల్లర రాజకీయాలు వద్దు

వేంపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోశాలపై కొన్ని రోజులుగా వైసీపీ, కూటమి నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని వెంటనే మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి హితవుచెప్పారు. రెండు పార్టీలకు గోమాతలన్నా, కలియుగదైవం వేంకటేశ్వరస్వామి అన్న ఏమాత్రం భక్తి, గౌరవం లేదని ఆరోపించారు. రెండు పార్టీల నేతలు రాజకీయంగా పైచేయి సాధించాలని ఆశతో సవాళ్లు విసురుకుంటున్నారు తప్ప నిజంగా భక్తిభావం లేదన్నారు. గోమాతల మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాల్సింది పోయి దిగజారుడు రాజకీయాలకు పూనుకోవడం సిగ్గుచేటని ఆ ప్రకటనలో మండిపడ్డారు.

టెండర్లు వేయకుండానే పనులు : వైసీపీ

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): టెండర్లు వేయకుండానే కడప ఎమ్మెల్యే అనుచరులకు ఇష్టానుసారంగా కట్టబెడుతున్నారని వైసీపీ నేతలు జైచంద్రారెడ్డి, శివప్రసాద్ తెలిపారు. కడప నగరంలో కొత్త సాంప్రదాయం ప్రారంభమైందని మండిపడ్డారు. శుక్రవారం మాజీఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇరిగేషన్‌లో టెండర్ లేకుండా పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారన్నారు. అలాగేనగరంలో సీసీ కెమెరాల ముసుగులో డాక్టర్లను లక్షల్లో వసూలు చేయడం సరికాదన్నారు. అదే విధంగా ప్రభుత్వ ధనంతో విచ్చలవిడిగా బుగ్గవంక సుందరీకరణ పేరుతో నిధులు ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, ఐస్‌క్రీమ్ రవి, మోతుక్కూరు సుబ్బరాయుడు,రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

వల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రంలో ఈ నెలాఖరు నుంచి జరగబోవు కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మీచెన్నకేశవ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పోలీసులు, దేవదాయశాఖ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పెద్ద ఓబన్న ఈ నెలలో జరగబోయే పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండ మీద పార్కింగ్‌స్థలం పరిశీలించామన్నారు. వీరి వెంట దేవదాయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున, ఈవో శ్రీనివాసులు, మండల టీడీపీ నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుగా పెన్నాతీరం..!

కుప్పలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు ● తొలగించకపోతే రోగాలే..


చెన్నూరు కొండపేట వంతెన కింద పెన్నాతీరం వద్ద కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

చెన్నూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పెన్నా తీరం డంపింగ్‌యార్డుగా మారింది. గ్రామ పంచాయతీలో సేకరించిన చెత్త ఇతర వ్యర్థాలు పెన్నానదితీరంలో వేయడంతో అవి గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఆ దారిలో వెళ్లే వారు వ్యర్థాల కంపు భరించలేక ముక్కు మూసుకుని ముందుకు పరిగెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది.పైగా పెన్నానదిలో స్నానం ఆచరించేవారు సైతం అక్కడ పరిస్థితి చూసి దుర్వాసన భరించలేక ఇదేం ఖర్మరా బాబూ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా స్వచ్ఛంగా ఉండే పెన్నానది ఇప్పుడు కలుషితంగా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్నానదిపై అటు చెన్నూరు పాత గ్రామంలోని కొండపేట దారిలోనూ, హైవే రహదారి పక్కన పంచాయతీలో సేకరించిన వ్యర్థాలను గ్రామ పంచాయతీ ట్రాక్టరు ద్వారా తీసుకెళ్లి పడవేస్తోంది. చాలా ఏళ్లుగా ఈ పరిస్థితి ఉంది. వీటిని బయట వేసేందుకు ఎక్కడా అంత స్థలం లేకపోవడంతో ఇక పెన్నాతీరమే వ్యర్థాలకు నిలయంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఇలా వ్యర్థాలు వేస్తుండడంతో కొండపేట వంతెన కింద సుమారు ఎకరా వైశాల్యంలో వ్యర్థాలు గుట్టలుగా తయారయ్యాయి. పైగా ఇళ్లల్లో నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలే కాక ప్లాస్టిక్ వస్తువులు, పనికిరాని సామాన్లు, కోళ్లు, పశువుల వ్యర్థాలు గ్రామంలో ఏ గ్రామంలో పశువులు, కుక్కలు, పందులు కోళ్లు చచ్చినా వాటి కళేబరాలన్నీ ఈ వ్యర్థాలతో కలిపి నదీతీరంలోకి చేరుతున్నాయి. దీంతో నదీ తీరం లోపలి వరకు ఈ వ్యర్థాల గుట్టలు చొచ్చుకుపోయాయి. ఇదేప్రాంతంలో కొండపేట వంతెన మొదటి నుంచి మల్లేశ్వరాలయానికి గతంలో గ్రావెల్ రోడ్డు వేశారు. అయితే గ్రావెల్ రోడ్డు వేశారనే మాటే కానీ ఆ దారిన గుడికి వెళ్లాలంటే వాహనాల్లో సైతం వెళ్లలేని పరిస్థితి ఇప్పుడు ఉంది. గాలివీస్తే అక్కడ వ్యర్థాలన్నీ ఇళ్లల్లోకి వెళ్లడం దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

హైవే వంతెన పక్కనా ఇదే పరిస్థితి

చెన్నూరు వద్ద కడప - కర్నూలు రహదారి పక్కన ఇదే పరిస్థితి. ఈ వ్యర్థాల పక్కన ఉన్న దారి గుండా సమీపంలో ఉన్న కొక్కిరాయపల్లె గ్రామానికి, అక్కడ ఉండే పంట పొలాలకు ప్రజలు రైతులు నిత్యం వెళుతుంటారు. ఇక్కడ కోళ్ల వ్యర్థాలు మరీ ఎక్కువే. ముఖ్యంగా చికెన్ సెంటర్ల నుంచి సేకరించిన వ్యర్థాలన్నీ ఇక్కడే పడేస్తున్నారు. అది ఇప్పుడు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. అదే ప్రాంతంలో పందులు సైతం పెంచుకోవడంతో ఆ వ్యర్థాల్లో స్వైరవిహారం చేస్తూ మరింత కంపును తెచ్చి పెడుతున్నాయి. వీటిని తొలగించాలని పై స్థాయి అధికారులకు తెలిపామని కొక్కిరాయపల్లె గ్రామ ప్రజలు చెప్పడం జరిగింది. అయినా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు.


చెన్నూరు హైవే వంతెన కింద పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు

వ్యర్థాలు వేయకుండా నిరోధిస్తున్నాం



జంతువుల కళేబరాలన్నీ పెన్నానదిలో వేయకుండా ప్రజలకు పదే పదే చెబుతున్నాం. అయినా తీసుకువచ్చి వేస్తున్నారు. వాటిని మట్టిలో పూడ్చిపెట్టమని చెబుతునా ఎవరూలేని సమయం లో విసిరేసి వెళుతున్నారు. ఇళ్ల వద్ద చెత్తబండ్లు వస్తాయి కాబట్టి వాటిని ట్రాక్టర్ల ద్వారా అందిస్తే ఎస్‌డబ్ల్యూపీసీకి చేరుస్తాం. అలాకాకుండా కొందరు నదిలో వేయడం వల్ల ఇబ్బందిగా ఉంది.

బి.రామసుబ్బారెడ్డి, సెక్రటరీ, చెన్నూరు

ఈ-వేస్ట్ నిర్మూలనకు సహకరించండి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలు తమ ఇంటి నుంచి వచ్చే ఈ-వేస్ట్, ఈ ఎలక్ట్రికల్ ,ఈ-ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను పూర్తిగా నిర్మూలించడానికి సహకరించాలని మున్సిపల్ కమిషనరు పగడాల జగన్నాథం తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి మూడో శనివారం జరిగే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న ఈవేస్ట్ నిర్మూలనకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ-వేస్ట్ అనగా పాత బల్బ్, రిమోట్, బ్యాటరీస్, కంప్యూటర్, మొబైల్ తదితరాలన్నీ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనానికి కానీ ,మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరులో కానీ అందించాలని ఆయన కోరారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయాలి

వేంపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఐదు మండలాలకు కేంద్రంగా ఉన్న వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిందన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆసుపత్రిలో విద్యుత్ సమస్య, ఈఎన్‌టీ పరికరాలు, బ్లడ్‌బ్యాంకు స్టోరేజీ, కొత్త పోస్టుమార్టం రూం, ఆక్సిజన్ స్టోరేజ్‌తో పాటు ఎక్స్‌రే ఆపరేటర్ ఉద్యోగిని నియమించాలని మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ


సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న మహేశ్వరరెడ్డి

చక్రాయపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని నాగులగుట్టపల్లె గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కష్టపడిన వారిని టీడీపీ ఎన్నటికీ మరచిపోదని, తగిన గుర్తింపును ఇస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులందరికీ రిజర్వేషన్ ఫలాలు


మల్లేష్

కడప ఎన్టీఆర్ సర్కిల్,ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దళితులందరికీ రిజర్వేషన్ ఫలాలను సీఎం చంద్రబాబు పంచుపెడుతున్నారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, కడప పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గన్నెపాటి మల్లేష్ పేర్కొన్నారు. శుక్రవారం కడపలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ సామాజిక వర్గంలోని మాదిగలకు ఇతర ఉపకులాల వారికి 2025 ఏప్రిల్ 15 మరపురానిదినం అన్నారు. ఆ రోజు జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తూ ఆమోదం తెలపడం శుభపరిణామమన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అన్నారు.

'వక్ఫ్ నల్లచట్టం రద్దు చేసే వరకు పోరు'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ద్వారా రూపొందించిన వక్ఫ్ సవరణ నల్లచట్టం రద్దు చేసేవరకూ దశలవారీగా పోరు సాగిస్తామని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేవరకు ఉద్యమాన్ని కొనసాగిమన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మైనార్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గఫార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కమాల్‌బాష, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

దారి సౌకర్యం కల్పించండి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగర బుడ్డాయపల్లె గ్రామ పొలం సర్వేనెంబర్ 496/3లో ఉన్న 2.50 ఎకరాల ప్లాట్లకు సంబంధించిన దారిని కొంతమంది ఆక్రమించడం బాధాకరమని ఆ ప్లాట్ల బాధితులు అన్నారు. ఆ మేరకు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆ ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు గత 2010 వరకు సక్రమంగా జరిగాయన్నారు. కాగా ప్రస్తుతంఆ ప్లాట్లకు రెండు పర్యాయాలు రిజిస్ట్రేషన్ చేయడం వలన దారి సమస్య ఉత్పన్నమైందన్నారు. ఈ విషయంగా జిల్లా అధికారులను కలిసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో బాధితులు ఎల్లారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, సిద్ధయ్య, మాబున్నీ, రఘురామ్‌రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఉన్నతస్థాయికి చేరవచ్చు

సీకేదిన్నె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా ఉన్నతస్థాయికి చేరవచ్చని జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధి రామసుబ్బారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో కె.రామమోహన్ అనే విద్యార్థి ఖోఖో క్రీడలో ఉత్తమ ప్రతిభ కనపరచి రైల్వేలో ఉద్యోగానికి ఎంపిక అవడంతో శుక్రవారం వారు అభినందించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ శివబాబు, ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్, పాఠశాల కమిటీ మెంబర్ క్రిష్ణప్రసాద్,వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్‌కుమార్ , భారత్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫరూక్ అహ్మద్, ఖోఖో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు నివారించవచ్చు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఎంతటి ప్రమాదం అయినా నివారించవచ్చని అగ్నిమాపక అధికారి జనార్దనరెడ్డి తెలిపారు. శుక్రవారం సబ్‌జైలు వారి ఆధ్వర్యంలో హెచ్‌పీ పెట్రోలు బంకు లో పనిచేస్తున్న సిబ్బందికి కరపత్రాలు పంపిణీ చేసి వారికి అగ్నిప్రమాదం నివారణపై అవగాహన కల్పించారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్, అగ్నిమాపక, పెట్రోలు బంకు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటపుడు జాగ్రత్తగా ఉండాలి

పులివెందుల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వాహనాన్ని నడిపేటపుడు జాగ్రత్తగా ఉండాలని పులివెందుల రూరల్ సీఐ రమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం యువత డ్రైవింగ్ చేసేటపుడు నిర్లక్ష్యంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, సీటుబెల్టు లేకుండా ప్రయాణం చేయడం ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పిల్లలకు అవగాహన వచ్చేలా వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి పాల్గొన్నారు.

పుత్తాను పరామర్శించిన టీడీపీ నాయకులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఇటీవల హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు హైదారబాదులో విశ్రాంతి తీసుకుంటున్న పుత్తాను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మల్లికార్జునశెట్టి, దాది రామయ్య, రెడ్డి కరీం, అజ్మతుల్లా, కౌన్సిలర్ పబ్బతి నరసింహులు శెట్టి, సీమన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించండి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలో తారకరామా నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మునీశ్వరస్వామి వార్షిక వేడుకలు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాయసాగర్ డ్యామ్ పక్కన ఉన్న మునీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నాగభైరవ స్వామికి ఘనంగా వార్షిక వేడుకలు జరిగాయి. ఆలయప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల బీజేపీ అధ్యక్షుడు తులసినాయుడు, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, శ్రీను, బాష, జనార్దన గుప్త, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై నరమేధం తగదు

ప్రజాసంఘాల ఐక్యవేదిక

కడప మారుతీనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై సాగుతున్న నరమేధం తక్షణమే ఆపుదల చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ప్రభుత్వాలను కోరారు. ఇందుకు నిరసనగా ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నగర గాంధీనగర్ హైస్కూల్ సమీప ఇంజనీర్స్ భవన్‌లో తలపెట్టిన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు శుక్రవారం ఎర్రముక్కపల్లెలో గల ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో పోస్టర్స్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో ఏపీ వైహెచ్‌పీఎస్ నాయకులు ద్రాక్షం శ్రీనివాసులు, పెనుగొండ పుల్లయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

హజ్‌కమిటీ మెంబర్‌కు అభినందనల వెల్లువ


మహబూబ్‌బాషను సత్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాషకు పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. మహబబూబ్ బాషకు హజ్ కమిటీ మెంబర్‌గా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నాయకుల మధ్య మహబూబ్ బాష కేక్ కట్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు శాలువ కప్పి మహబూబ్ బాషకు అభినందనలు తెలిపారు. అంతకుముందు పులివెందులలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి మహబూబ్ బాషకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర కెనాల్ హైలెవెల్ చైర్మన్ జోగిరెడ్డి,రఘునాథరెడ్డి,రవితేజరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కడప టౌన్ కార్పొరేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 8.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆపరేషన్) హరిసేవ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చెన్నూరు, వల్లూరు మండలాల్లో కూడా శనివారం ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు అంతరాయం ఉంటుం దన్నారు. శంకరాపురంలోని 220 కేవీ కడప విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందన్నారు.

21నుంచి ఉజ్జీవ సువార్త స్వస్థత సభలు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సీఎస్ఐ గ్రౌండ్స్‌లో ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటల నుంచి ఉజ్జీవ సువార్త సభలో జరుగుతాయని నిర్వాహకులు, సభల కన్వీనర్ బ్రదర్ జోసఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలు స్థానిక సంఘ కాపరులు,నాయకుల సహాయంతో జరుగుతాయన్నారు. ఈ సువార్త సభలకు కడప నగర ప్రజలందరూ హాజరై దేవుని దీవెనలు పొందాలని బ్రదర్ జోసఫ్ తెలిపారు.

లాడ్జీల్లో తనిఖీలు

కడప క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పోలీసులు శుక్రవారం విస్తృతంగా లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. లాడ్జీలలోని రిజిస్టరును పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జిల నిర్వాహకులు సూచించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

కడప కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శుభ శుక్రవారం సందర్భాన్ని పురస్కరించుకుని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం విచారణ డైరెక్టర్ ఎం.డి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్ ఆధ్వర్యంలో నగర డాన్ బోస్కో ఐటీఐ నుంచి ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం వరకు పురవీధులలో సాగిన శిలువ యాత్ర విశ్వాసులను ఎంతగానో ఆకట్టుకుంది. సాయంత్రం క్రీస్తు మరణ విధానం గురించి విశ్వాసులకు వివరించారు. అనంతరం ఉపవాసం వున్న వారికి మజ్జిగ, మంచినీరు, అల్పాహారం ప్రేమ విందును పంచిపెట్టారు.

మరియాపురం పాతచర్చి ఆవరణలో..: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం కడప మరియాపురం పాత చర్చి ఆవరణంలోప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విశ్వాసులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా కడప మేత్రాసన పీఠాధిపతి (బిషప్) సగినాల పాల్ ప్రకాష్ విశ్వాసులనుద్దేశించి మాట్లాడారు.అనంతరం శిలువను భుజంపై మోశారు.

వేంపల్లె..: గుడ్‌ఫ్రై సందర్భంగా కల్వరి టెంపుల్ చర్చి నిర్వాహకులు పాస్టర్ రవి ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఏసుప్రభువును చిత్రహింసలకు గురిచేసి సిలువతో మోసే ఘట్టాన్ని ప్రదర్శించారు. నాలుగురోడ్ల కూడలి నుంచి బిడాలమిట్టలోని కల్వరి టెంపుల్ చర్చివరకు సిలువను మోశారు.

వల్లూరు..: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని మండల పరిధిలోని పైడికాల్వ, ఆర్సీయం చర్చి ఫాదర్ రవీంద్ర ఆధ్వర్యంలో శిలువయాత్రను గ్రామంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలో శిలువ యాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కూలూరులూర్దురెడ్డి, కూలూరు ప్రతాప్‌రెడ్డి, రాజవర్ధన్, మత్తయ్య పాల్గొన్నారు.

చెన్నూరు..: లోకానికి వెలుగునిచ్చిన ఏసుక్రీస్తు మానవ జీవనానికి మార్గదర్శకుడయ్యాడని స్థానిక ఆర్సీయం చర్చి ఫాదర్ విజయరావు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా చెన్నూరు పురవీధులల్లో శుక్రవారం ఏసుక్రీస్తు శిలువ మోస్తున్న వేషధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేశ్, కుమార్, కర్ణ, ప్రశాంత్, చిన్నయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని ఆర్సీయం చర్చి ఫాదర్ జీవన్ కుమార్, సీఎస్ఐ చర్చి పాస్టర్ సాల్మన్‌బాబు తెలిపారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా మూడురోడ్ల కూడలి నుంచి ఆర్సీయం చర్చి వరకురైల్వేగేటు నుంచి సీఎస్ఐ చర్చి వరకు శిలువ యాగం నిర్వహించారు.

పులివెందుల రూరల్..: గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు త్యాగాన్ని గుర్తుకుచేసుకుంటూ ర్యాలీ చేశారు. పట్టణం లోని ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తన తండ్రి గోటూరు ఓబన్న జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ముస్లింలు పాల్గొని అన్నం వడ్డించడం విశేషం.

లింగాల..: గుడ్‌ఫ్రైడే సందర్భంగా లింగాల అఖిల భారత బేతేలు ప్రార్థన మందిరం, పెద్దకుడాల, పార్నపల్లె గ్రామాలలోని ప్రార్థన మందిరంలలో క్రైస్తవులు ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. యేసు క్రీస్తు సిలువపై రక్తం చిందిస్తూ పలికినేడు మాటలను పాస్టర్లు క్రైస్తవులకు వివరించారు.

కడప ఎర్రముక్కపల్లె..: కడప నగరం కృప ప్రార్థనా మందిరంలో శుభ శుక్ర వారంలో భాగంగా క్రైస్తవులు పెద్దఎత్తున కూడుకొన ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జోసెఫ్ ప్రసన్నకుమార్, కృపేష్ ప్రసన్నకుమార్ ప్రసంగించారు.


పులివెందులలో..


కడపలో కల్వరి యాత్రలో యేసు ప్రభువును చిత్రహింసలు పెడుతున్న దృశ్యం


వల్లూరులో శిలువ యాత్ర చేస్తున్న క్రిస్టియన్లు

చెన్నూరులో..



కమలాపురంలో..



మూగజీవాలకు వైద్యసేవలు

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చౌడూరు గ్రామంలో మూగజీవాలకు ఉచిత వైద్యసేవలు అందించారు. గోపవరం పంచాయతీ పరిధిలోని పశువైద్య కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని చేపట్టి 320 పశువులకు గర్భకోశ వ్యాధులు, మందగూబ శస్త్ర చికిత్సలు, వివిధ జబ్బులకు చికిత్సలు అందించారు. జీవాలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ డి.ఇందిర, డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు డాక్టర్ సుమిరన్, డాక్టర్ రేవతి, డాక్టర్ విజయకుమార్, చౌడూరు పశువైద్యశాల ఇన్‌చార్జి వైద్యులు డాక్టర్ రవీంద్రారెడ్డి, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం ఎస్సీలు దరఖాస్తు చేసుకోవాలి

చాపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎస్సీలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వీరకిశోర్ కోరారు. ప్రభుత్వం మండలానికి 30 యూనిట్లు మంజూరు చేసిందన్నారు. ఒక్కో యూనిట్‌కు సబ్సిడీ రూ.ఒక లక్ష నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుందన్నారు. నిరుద్యోగులు చేపల పెంపకం, బేకరి, ఆర్వో ప్లాంట్లు, వానపాముల పెంపకం, దుకాణాలు, వంటివి ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు గడువు పెంపు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ తరపున రుణాలు పొందేవారికి దరఖాస్తు చేసుకునేందుకు మే 10వతేదీ వరకు గడువు ఉంటుందని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. గత నెల 14వతేదీ నుంచి రుణాల దరఖాస్తులు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని లబ్ధిదారుడు రాష్ట్రానికి చెందిన వారై ఎస్సీ కుల ధృవీకరణ పత్రం తప్పకుండా ఉండాలన్నారు. 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు కలిగి బీపీఎల్ కేటగిరి కింద స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకునేవారు జనరిక్ ఔషధ దుకాణాలు ఏర్పాటుకు బీఫార్మశీ, ఎం.ఫార్మశీ ఉత్తీర్ణత సాధించాలన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన



దువ్వూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరసన వ్యక్తపరిచారు. మండల పరిధిలో 14 మంది జీహెచ్‌వోలుగా పనిచేస్తున్నామని రెండేళ్లుగా జీతభత్యాలు అందడంలేదని ఆవేదన వెలిబుచ్చారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

నేడు ఎమ్మెల్యేలు, కలెక్టర్ రాక

దువ్వూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని చల్లబసాయిపల్లె వద్ద ఉన్న గోశాలను మైదుకూరు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్‌యాదవ్, ఎన్.వరదరాజులరెడ్డి శనివారం సందర్శించనున్నట్లు మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. వారితోపాటు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వస్తున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కన్వీనర్ కోరారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా అచ్యుతరాజు నియామకం



నియామక పత్రం ఇస్తున్న విజయజ్యోతి

బద్వేలు , ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా యర్రగుడి అచ్యుతరాజు నియమితులయ్యారు. ఆ మేరకు ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి నియామక పత్రం అందజేశారు. అనంతరం అచ్యుతరాజు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డికి, విజయజ్యోతి, ఏపీ మీడియా చైర్మన్ తులసిరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

మూగరోదన.. రైతు ఆక్రందన

- గొంతువాపు, పారుడు వ్యాధితో గొర్రెలు, మేకలు మృత్యువాత
- వైద్య చికిత్స అందించి ఆదుకోవాలంటున్న యజమానులు



అనారోగ్యానికి గురైన మేకలు, గొర్రెలు

బి.కోడూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గొంతువాపు, పారుడు వ్యాధితో గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో వాటి యజమానులైన రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల పరిధిలోని రెడ్డివారిపల్లె, గొడుగునూరు, నల్లవాగుపల్లె గ్రామాల్లో చాలా మంది రైతులు గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత వారం రోజుల నుంచి ఉన్నట్లుండి మేకలకు, గొర్రెలకు గొంతు వాపు రావడం, కడుపుబ్బరం, పారుడుతో వెంటనే చనిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వైద్యాధికారులను పిలిచినిప్పటికీ వ్యాధికి తగిన చికిత్స చేయలేని పరిస్థితి నెలకొందంటున్నారు. రెడ్డివారిపల్లె గ్రామంలోని సుంకర పెద్దన్నకు చెందిన 20మేకలు, 30 గొర్రెలు మృతి చెందగా కత్తికొండయ్యకు చెందిన 15 మేకలు, తులశమ్మకు చెందిన 16 మేకలు గత వారం నుంచి చనిపోతున్నాయి, సుంకర పెద్దన్న అనే రైతు మేకలు ఎందుకు చనిపోతున్నాయో కడుపులో ఏమైందోనని చనిపోయిన ఒక మేకను కోసి చూడగా లివర్ పొడలు పొడలుగా బొబ్బలు బొబ్బలుగా ఉందని చెబుతున్నాడు. ఇప్పటికైనా ఉన్నత వైద్యాధికారులతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మేకలకు, గొర్రెలకు వచ్చే వ్యాధికి సకాలంలో వైద్యం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పశువైద్యం ఏదీ..?

మండలంలో చాలా మంది రైతులు పాడి పశువులు, గొర్రెలు, మేకలు మీదనే ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారు. లక్షలు వెచ్చించి పశువును కొనుగోలు చేసి తీసుకువస్తే ఆ పశువుకు జబ్బు చేసిందంటే రైతు నష్టపోవాల్సిందే. అధునాతన వైద్యం పశువులకు అందిస్తున్నా ఏ ఒక్క పశువును ఇంత వరకు వైద్యాధికారులు బతికించలేదనే వాదన రైతుల్లో వినబడుతుంది. మేకలు, గొర్రెలు కూడా అంతే. ఇటీవల గోవిందాయపల్లెలో చెన్నారెడ్డి అనే రైతుకు చెందిన లక్ష రూపాయల పాడిపశువుకు జబ్బు చేసింది. వైద్యాధికారిని సంప్రదించగా వచ్చి చూసి ముసర వ్యాధి వచ్చిందని మందులు తీసుకురమ్మని చెప్పి వాడిన పశువు బతకలేదు. ఇలా మండలంలో ఏదోక గ్రామంలో తరచూ పశువులు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

పశువైద్యాధికారి ఏమన్నారంటే..

పశువులు, గొర్రెలు, మేకలు మృత్యువాత విషయమై పశువైద్యాధికారి భరద్వాజ క్రిష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కలుషిత నీరు, కలుషిత మేత తినడంతో లివర్ దెబ్బతిని చనిపోతున్నాయని తెలిపారు. రైతులు అడిగితే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అరుంధతి

ముద్దనూరు ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. శుక్రవారం నలుగురు ఎంపీటీసీ సభ్యులతో కోరం ఉందని ఇన్‌చార్జి ఎంపీడీవో అరుంధతి సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సర్వసభ్య సమావేశానికి వైసీపీ 6మంది ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరుకాలేదు. దీంతో తిరిగి వాయిదా పడే అవకాశం ఏర్పడింది. అయితే కూటమి ఎంపీటీసీలు ముద్దనూరు-3 ఎంపీటీసీ లక్ష్మికాంతమ్మ, యామవరం ఎంపీటీసీ మాధవి, బొందలకుంట ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, వారితో పాటు పెనికెలపాడు వైసీపీ ఎంపీటీసీ ఏసుదాసు ఎంపీడీవో కార్యాలయంకు చేరుకోవడంతో సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఆరోగ్యం, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అరుంధతి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు,సీడీపీవో ముంతాజ్‌బేగం, ఏవో వెంకటకృష్ణారెడ్డి,పీఆర్ ఏఈ మునికుమార్ పాల్గొన్నారు.

రెండు వేర్వేరు అగ్ని ప్రమాదాలు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు మండుతుండటంతో వేర్వేరు చోట్ల రెండు అగ్ని ప్రమాదాలు జరిగాయి. శుక్రవారం స్థానిక వైఎంఆర్ కాలనీ లో గల ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న తీగలపై కోతి పడటంతో మంటలు చెలరేగాయి .దీంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసి ట్రాన్స్‌ఫార్మర్ పేలకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే మైదుకూరు రోడ్డు గత పీబీఎస్ కొబ్బరి పీచు పరిశ్రమలో కొబ్బరి పీచు అంటుకొని మంటలు రేగాయి. దీంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకోని మంటలను ఆర్పింది. ఈ పరిశ్రమలో రూ. 20 వేల ఆర్థిక నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పెరిగే అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో అగ్నిమాపక అధికారులు అవగాహనకల్పించారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని పీవీసీ పైపుల ఫాక్టరీలో పది సంవత్సరాలకు ఒక సారి ఎలక్ట్రికల్ వైరింగ్‌ను పరి శీలించి మార్పు చేసుకోవాలన్నారు. కొర్రపాడు రోడ్డులోని టీవీఆర్ పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలో డెమో ఇచ్చి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు అగ్నిమాపక కార్యాలయం వద్ద, పట్టణంలోని గ్యాస్ గోడౌన్ వద్ద శుక్రవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు అధికారి సత్యంరెడ్డి ఆధ్వర్యంలో వారి సిబ్బంది, గ్యాస్‌గోడౌన్ల ఆటో డ్రైవర్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. వారోత్సవాల నిర్వహణలో భాగంగా కరపత్రాలు అందించి అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు తెలియజేశారు.

ఈదురుగాలులు, చిరుజల్లులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు పెరగడం, వేడి ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ఉన్నట్లుండి సాయంత్రం పెద్దముడియం మండలం పెద్దపసుపుల తదితర ప్రాంతాల నుంచి జమ్మలమడుగులో మోరగుడి, ముద్దనూరు రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులలో ఆయా గ్రామాల్లో ఈదురుగాలులు వీచాయి. దీంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. సుమారు గంటకుపైగా కరెంటు ఆయా ప్రాంతాల్లో నిలిచిపోయింది. చిరుజల్లులు కురిశాయి. ప్రధాన రోడ్లు అక్కడక్కడ చిత్తడిగా మారింది.

భూఆక్రమణలను సహించేదిలేదు : ఆర్డీవో

- నాయనపల్లె అటవీ పొరంబోకు భూముల పరిశీలన
- రెవెన్యూ అధికారులపై ఆగ్రహం ● రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం



నాయనపల్లె కొండపొరంబోకు భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

కాశినాయన ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి):భూఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ హెచ్చరించారు. శుక్రవారం నాయనపల్లె రెవెన్యూ పొలంలో ఆక్రమణకు గురైన సర్వే నెంబర్ 128, 129(1),130 కొండ పొరంబోకు భూములను ఆయన పరిశీలించారు. ఇప్పటికే పలువురు దర్జాగా రెవెన్యూ అధికారులు నాటిన హెచ్చరిక బోర్డులను తొలగించి ఆక్రమించుకొని అరటి తోటలను సాగుచేశారు. వాటన్నింటిని సమగ్రంగా పరిశీలించిన ఆర్డీవో మాట్లాడుతూ ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వందల ఎకరాల ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించి ఎస్టేట్‌లు తయారు చేస్తుంటే రెవెన్యూ అధికారులు ఏమిచేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆక్రమణకు గురైన భూములను డ్రోన్‌ల సహాయంతో సమగ్రంగా పరిశీలన చేసి ఎంత ఆక్రమించారు ఎవరెవరు ఆక్రమణకు పూనుకున్నారో రెండు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఆర్ఐ అమర్‌నాద్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి సర్వేయర్ రామాంజనేయులు, సర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' సుబ్బరామిరెడ్డి మృతి



ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షకుడు శెట్టిపల్లె సుబ్బరామిరెడ్డి (స్పందన సుబ్బరామిరెడ్డి)(89) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయన స్పందన స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేసి పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యపరిచారు. వేలాది మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం కృషి చేశారు. ఆయనచేసిన కృషితో స్పందన ఆయన ఇంటిపేరుగా మారింది. ఆయన చాపాడు మండలం నక్కలదిన్నెలో జన్మించారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు, కడప ఆర్ట్స్ కళాశాల, ఎస్వీ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ చదివారు. యూనివర్సిటీలో ఉన్నప్పుడే మిత్రులతో కలిసి వివిధ సేవా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి కళాశాల లేకపోవడంతో శెట్టిపల్లె చిన్ననాగిరెడ్డి ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. రాయల నాటక కళాపరిషత్ వారు రాష్ట్రస్థాయి ఆటల పోటీలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహించారు. కేసీ కెనాల్ ఆయకట్టుదారుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా రైతు సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు. ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు కృషి చేశారు. ప్రొద్దుటూరు పాల కర్మాగారం ఏర్పాటుకు కృషి చేయడమేకాక మొదటి చైర్మన్‌గా పాలఫ్యాక్టరీ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రోటరీ క్లబ్ సభ్యునిగా మెడికల్ క్యాంపులు నిర్వహించి పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. రాస్ ఉపాధ్యక్షునిగా పట్టణంలో వికాస్‌విహార్ మానసిక వికలాంగ పాఠశాల ఏర్పాటు చేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వీరశివారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, పట్టణ ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దాతృత్వం



సుబ్బమ్మకు నగదు అందజేస్తున్న చంద్రశేఖర్

కాశినాయన ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): నర్సాపురంలోని నిరుపేద కుటుంబానికి చెందిన గోసుల సుబ్బమ్మకు మూలపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ చంద్రశేఖర్ శుక్రవారం రూ.5వేల నగదు, మూడువేల రూపాయల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. సొంతఖర్చుతో బాతురూము నిర్మించి ఇస్తానన్నారు. బాధితురాలు గోసుల సుబ్బమ్మ గత కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల కడప రిమ్స్‌లో ఆమె ఎడమ కాలికి శస్త్రచికిత్స చేశారు. దీంతో ఆమె మంచానికి పరిమితం అయింది. భర్త రామయ్య కూడా గొంతు సంబంధిత వ్యాధితో ఏపనిచేయలేని స్థితిలోఉన్నాడు. వారి దీనస్థితిని తెలుసుకున్న చంద్రశే ఖర్ వారి కుటుంబానికి సహాయమందించారు. ఇటీవలే ఇదే గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మాయలూరి శ్రీదేవి కుటుంబానికి రూ.50 వేలతో ఇల్లు మర మ్మతులు చేయించి ,సరుకులు, బీరు అందజేశారు.

పోరుమామిళ్లలో ఉద్యానవనానికి శ్రీకారం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవనానికి పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ శ్రీకారం చుట్టారు. శుక్రవారం పోరుమామిళ్ల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో ఉద్యానవనానికి అర్థ ఎకరా భూమిలో చెట్లు నాటించేందుకు గుంతలు వేయించారు. ఉపాధి కూలీలు, పంచాయతీ కార్మికులతో ఆవరణలో పరిసరాలు శుభ్రం చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో బోరు, మోటరు బిగించి మామిడి, బత్తాయి, జామ, సపోట, ఉసిరి, నేరేడు పంటలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ షరీఫ్ పాల్గొన్నారు.

'కులమతాల మధ్య చిచ్చురేపడమా..!'

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆర్కే రోజా, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిలు ప్రజల మధ్య కులమతాలతో చిచ్చురేపుతున్నారని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ విమర్శించారు. శుక్రవారం టీడీపీ బీసీసెల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి గోశాలలో ఆవులు చనిపోయాయని, వారు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలలో దుకాణాల యజమానుల నుంచి కమీషన్లు వసూలు చేశారని, అలాగే మాజీ మంత్రి రోజా ఆర్జిత టిక్కెట్లు అమ్ముకోవడమేకాక వందలాది మందిని తన వెంట వీఐపీ దర్శనానికి తీసుకెళ్లి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నితమైన అంశాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, బీసీ నాయకులు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు.. చర్చిలలో ప్రార్థనలు



సందేశమిస్తున్న ఎస్పీజీ-2 చర్చి పాస్టర్ రెవరెండ్ కోలాటి రాజు, ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తుకు శిలువ వేయబడిన సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గోకుల్‌నగర్‌లోని ఎస్పీజీ-2 చర్చిలో పాస్టర్ రెవరెండ్ కోలాటిరాజు గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువపై ఉన్నప్పుడు మానవాళికి చెప్పిన ఏడు వాక్యాలను ప్రేమ, కరుణ, దయ, మానత్వం, త్యాగం, క్షమాగుణం, సహనాన్ని కలిగి ఉండాలని తెలిపారు. యేసుక్రీస్తు త్యాగానికి గుర్తుగా గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు. రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో డివిజనల్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ జాకోబ్ ఫ్రాంక్ మాట్లాడుతూ క్రీస్తు జీవితం మానవాళికి మార్గదర్శకమన్నారు. యేసుక్రీస్తు శాంతిదూతగా అవతరించారని మానవాళి పాపపరిహారం కోసం తన ప్రాణాలను అర్పించారన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు.



జమ్మలమడుగు టౌన్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన భక్తులు

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శుక్రవారం ఆయా చర్చిలలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అందులో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని టౌన్ చర్చిలో సీఎస్ఐ, టీసీసీ, ఐక్య ఆరాధనలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలాగే పట్టణంలోని సీఎస్ఐ క్రైస్ట్‌చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవులను ఉద్దేశించి సంఘ గురువులు జనార్ధన్‌బాబు, థామస్‌బాబు, జోషఫ్‌బాబు తదితరులు సందేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరు క్రీస్తుబాటలో నడవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు పట్టణంలోని క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్లలో: ప్రపంచ మానవాళికి పాప క్షమాపణ నిమిత్తమై తన ప్రాణాన్ని బలి యాగముగా యేసుక్రీస్తు అర్పించారని పాస్టర్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఎర్రగుంట్ల సెయింట్ పీటర్స్ సీఎస్ఐ చర్చిలో భక్తులు ప్రార్థనలు జరిపారు. ప్రార్థనల అనంతరం వచ్చిన భక్తులందరికి భోజన వసతిని కల్పించారు.



రాజుపాలెంలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ మహిళలు

రాజుపాలెంలో:మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు, ఉదయం నుంచి చర్చిలలో సాయంత్రం 3 వరకు ప్రార్థనలు చేశారు. పాస్టర్ వరప్రసాద్ ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల గురించి వివరించారు. ఆదివారం మళ్లీపండుగ జరుపుకుంటున్నట్లు తెలిపారు.

ముద్దనూరులో:మండలంలోని చర్చిలలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి ఆర్సీఎం చర్చి వరకు యేసు శిలువ యాగం నిర్వహించారు. అలాగే సీఎస్ఐ, ఎస్పీజీ,హెబ్రోను, మన్నచ హోసన్న, పెంతేకోస్తు, గుత్తిశాల చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.



పోరుమామిళ్లలో శిలువ మోస్తున్న ఫాదర్

పోరుమామిళ్లలో: పోరుమామిళ్లలో గుడ్‌ఫ్రైడే వేడుకను నిర్వహించారు. శుక్రవారం పోరుమామిళ్లలోని ఆర్సీయం చర్చి విచారణలో జ్వాలా విజయభాస్కర్, అనిల్‌ఫాదర్ ఏసుప్రభువును శిలువ ఎలా చేశారో భక్తులకు తెలియపరిచారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద నుంచి కల్వరిగిరి వరకు ఈ శిలువ మా ర్గం కొనసాగింది., సహజసిద్ధ నటనతో వేషధారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కేథలిక్ విశ్వాసులు, ప్రజలు, ఫాదర్లు, కల్వరిగిరి ప్రాంతానికి వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు కొంతమందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

మైలవరంలో: మండల పరిధిలోని తలమంచిపట్నం, మైలవరం, వద్దిరాల, చిన్నవసుపుల తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఆయా చర్చిలలో పాస్టర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ భక్తులు యేసుప్రభువు అడుగుజాడల్లో నడవాలని వివరించారు. 40 రోజులపాటు ఉపవాస ప్రార్థనలు పురష్కరించుకుని శుక్రవారం గొప్ప శుక్రవారంగా ఆచరిస్తారని వివరించారు.

కలసపాడులో: మండలంలోని చెన్నారెడ్డిపల్లె, కలసపాడులతో పాటు మండల వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మానవుల పాపాలను క్షమించి వారికి రక్షణ ఇచ్చేందుకు ఏసుక్రీస్తు శిలువ మీద మరణించిన రోజు అని బోధకులు వివరించారు. ఆయా గ్రామాలలో ఉపదేశిల ఆధ్వర్యంలో సిలువలను మోస్తూ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలలో పలువురు హిందువులు, ముస్లింలు పాల్గొన్నారు.



బద్వేలులో శిలువ మోస్తున్న దృశ్యం

బద్వేలు రూరల్‌లో : పట్టణంలోని పలు చర్చిలలో గుడ్‌ఫ్రైడే వేడుకలును క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు శిలువ మార్గం వేషధారణ, పిలాతు భటులు వేషధారణతో పట్టణ పురవీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజ్, సహాయక గురువులు ఫాదర్ నాగిపోగు రాజేంద్ర, విశ్వాసులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన విజ్ఞాన్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు కళాశాల నిర్వాహకులు నగదు పురస్కారాలను అందజేశారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ చేతుల మీదుగా ఆరుగురు విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వీఎస్.ముక్తియార్ మాట్లాడుతూ కళాశాలను స్థాపించిన అనతి కాలంలోనే అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల నిర్వాహకులు విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు బహుమతులను అందజేయడం హర్షణీయమన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆరుగురికి నగదు బహుమతి, మెమొంటో, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆలీఅక్బర్, డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఖాజామైనుద్దీన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వెంటనే డబ్బులు విడుదల చేయాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు డబ్బులు వెంటనే చెల్లించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఉపాధి పథకం కూలీలకు తొమ్మిదివారాలైనా పనిచేసిన డబ్బులు ఇవ్వకపోవడంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబ్బులు చెల్లించడంలో జాప్యం సరైంది కాదన్నారు.

వైసీపీ నాయకులవి విద్వేష రాజకీయాలు

చాపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు విద్వేష రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి గోశాలలో గోవులు మృతిచెందుతున్నాయని అసత్యప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. దేవతలతో సమానంగా భావించే గోమాతలపై వైసీపీ నాయకులు అసత్యప్రచారాలు చేయడం టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందన్నారు. గోశాలలో వృద్ధాప్యం కలిగిన, ఇతర వ్యాధులతో గోవులు చనిపోవడం మామూలేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కులాల మధ్య వివాదాలు సృష్టించేందుకే వైసీపీ వారు పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు.